ప్రజాశక్తి
సోమవారం 6 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం



చెరువులో పడి పిల్ల ఏనుగు మృతి



పార్వతీపురంటౌన్ : మండలంలోని లక్ష్మీనారాయణపురం శివారులో గల చెరువులో దిగిన ఏనుగు పిల్ల మునిగి బురదలో కూరికిపోయి మృతి చెందింది. ఇటీవల ఈ పరిసర ప్రాంతాల్లో 9 ఏనుగులు గుంపు సంచరించిన సంగతి తెలిసిందే. అయితే ఆదివారం ఆ ఏనుగులు గుంపు ముదిరాజ్ చెరువులో దిగి స్నానాలు చేస్తుండగా, పిల్ల ఏనుగు నీటిలో బురద కూరుకుపోయి మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పూర్తి విచారణ చేపడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఈ నిర్లక్ష్యానికి కారకులెవరు?

మూడేళ్లుగా మూలన పడిన వాటర్ ప్లాంట్లు
అసలు సమస్యని పక్కనపెట్టి అధికారుల హడావుడి
చాపకింద నీరులా విస్తరించిన పచ్చకామెర్లు

మరమ్మతులకు గురైన ఆర్ఒ ప్లాంట్



ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినుల మతి, మరో 50మందికి అస్వస్థతకు అసలు కారణం ఏమిటనే చర్చ జరుగుతోంది. పాఠశాలలో విద్యార్థినులకు రక్షిత మంచినీటి సరఫరా జరగడం లేదనేది స్పష్టమయింది. పాఠశాలలోని వాటర్ ప్లాంట్ గత కొంతకాలంగా పని చేయడం లేదని రుజువైంది. దీని కారణంగానే చాపకింద నీరులా పచ్చకామెర్లు వ్యాధి విస్తరించి విద్యార్థినుల ప్రాణాలను బలిగొన్నట్లు తెలుస్తోంది. కలుషిత నీటిని వినియోగించడం వల్లనే పచ్చకామెర్లు వ్యాధి లక్షణాలు కనబడ్డాయి. పచ్చకామెర్లు అనేది ఒక రోజు, వారం రోజులు లేదా నెల రోజుల నిర్లక్ష్యం వల్ల వచ్చిన వ్యాధి కాదు, గత కొన్నేళ్లుగా విద్యార్థినులు రక్షిత మంచినీరు వినియోగించడం లేదని స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు కురుపాం గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడంతో అధికార యంత్రాంగంలో ఆలస్యంగా నిద్ర లేచింది. పాఠశాలలో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదన్న విషయం గిరిజన సంక్షేమ అధికారులకు తెలుసు. తెలిసినా వాటర్ ప్లాంట్‌ను ఎందుకు మరమ్మతు చేయలేదు, ఒకవేళ అది పని చేయకపోతే కొత్త ప్లాంట్ ఏర్పాటులో జాప్యం ఎందుకు జరిగిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా గిరిజన సంక్షేమ అధికారులు పాఠశాలను సందర్శించడం, విద్యార్థినులు చికిత్స పొందుతున్న ఆసుపత్రులకు వెళ్లి పరామర్శించడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు కురుపాం గురుకుల పాఠశాలలో నెలకొన్న పరిస్థితులే ఐటిడిఎ పరిధిలో ఉన్న చాలా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వున్నాయి. అక్కడ కూడా వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడంతో మూలన పడి వున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన వాటర్ ప్లాంట్లలో 90 శాతం మరమ్మతుకు గురయ్యాయి. పాఠశాలల అధికారులు చేతనైనంత వరకు వాటిని మరమ్మతు చేయించి నడిపిస్తున్నారు. లేకపోతే చేతులెత్తేస్తున్నారు. వాటర్ ప్లాంట్లు పని చేయడం లేదన్న విషయం గిరిజన సంక్షేమ ఉన్నతాధికారుల దృష్టిలోనూ వుంది. వాటి స్థానం లో కొత్త వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న ఆలోచన లేకుండా అధికారులు ఇంతవరకు కాలయాపన చేశారు. దీని ఫలితం గానే కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో ఆరోగ్య పరిస్థితి చేయి జారుతున్నట్లు కనిపించడంతో గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి గౌతమి రంగంలోకి దిగారు. పాఠశాలను ఆమె శనివారం సందర్శించి ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులను విచారించారు. ఆదివారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కూడా ఆమె పరామర్శిం చారు. కలుషిత నీటి వినియోగం వల్లే పచ్చకామెర్లు విద్యార్థినులకు వ్యాపించిందని ఆమె స్పష్టత ఇచ్చారు. పాఠశాలలో మరో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇంత నష్టం జరిగిన తర్వాత గిరిజన సంక్షేమ ఉన్నతాధికారిగా వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమస్య దాదాపు అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లోనూ వుంది.

గిరిజన సంక్షేమ మంత్రి, ఎమ్మెల్యే ఎక్కడ?

ఇద్దరు విద్యార్థుల మతి, మరికొందరు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికావడంపై జిల్లా మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యే టి.జగదీశ్వరి ఇంతవరకు స్పందించకపోవడం చర్చనీయాంశమవుతోంది. గత వారం రోజులుగా గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థుల అనారోగ్యం పాలుకావడం రాష్ట్ర స్థాయి గిరిజన సంక్షేమ అధికారులకూ తాకింది. కానీ జిల్లాలో గల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి, స్థానికంగా ఎమ్మెల్యేకు పట్టకపోవడం వివాదాస్పద మవుతోంది. ఇంత పెద్ద సంఘటన జరిగినా వీరు బాధిత కుటుంబాలకు పరామర్శ చేయకపోవడం, అధికారులను అప్రమత్తం చేయకపోవడంపై గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి.

ప్రభుత్వమే అసలు ముద్దాయి

గిరిజన విద్యార్థుల మరణానికి అసలు కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని స్పష్టంగా కనిపిస్తోంది. అనేక ఏళ్లుగా వాటర్ ప్లాంట్లు పని చేయకపోయినా వాటి మరమ్మతు కోసమో, కొత్త ప్లాంట్ కొనుగోలు కోసమో నిధులు మంజూరు చేయకపోవడంతో ఇప్పుడు విద్యార్థుల ప్రాణాల మీదకు వచ్చింది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదనే విషయాన్ని పాఠశాల హెచ్‌ఎంలు ఐటిడిఎ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అయినా గిరిజన సంక్షేమం పట్ల ఉదాసీనత కారణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి జిల్లాకు చెందిన గిరిజన నాయకురాలే. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకానికి సంబంధించి ఫైలుపై ఆమె తొలి సంతకం చేసి ఏడాదిన్నరయింది. ఆ ఫైలుకే ఇంతవరకు అతీగతీ లేదు.

నిలకడగా విద్యార్థినుల ఆరోగ్యం

గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి గౌతమి

ప్రజాశక్తి - పార్వతీపురం

కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పచ్చకామెర్ల లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి ఎం.గౌతమి అన్నారు. ఆదివారం స్థానిక సర్వజన ఆసుపత్రిలో విద్యార్థినులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సంఘటన జరిగిన వెంటనే మిగిలిన సుమారు 600 మంది విద్యార్థినులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు వైద్య సేవలందించడం జరిగిందన్నారు. అయినా సుమారు 120 మంది విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలు వచ్చాయని, వారిని వెంటనే జిల్లా ఆసుపత్రి తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఎవరైతే పచ్చకామెర్లు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారో వారిని విశాఖ కెజిహెచ్‌కు తరలించి వైద్య సేవలను అందిస్తూ, నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రతి విద్యార్థినిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వైద్య సేవలందిస్తున్నామని, ఎవరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జరిగిన సంఘటనలపై ప్రత్యేక బృందాన్ని నియమించామని, వారు సమగ్ర విచారణ జరిపి నివేదికలు సమర్పిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పాఠశాలలో కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, మరి కొన్ని నెలల పాటు పూర్తి జాగ్రత్తలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు. సికిల్ సెల్, అనీమియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఎటువంటి చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా విద్యార్థులు తల్లిదండ్రులు అశ్రద్ధ చేయొద్దని కోరారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, వైద్య ఆరోగ్య శాఖ సూపరింటెండెంట్ నాగశివ జ్యోతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న గౌతమి

శివన్నపేట పాఠశాలకు వారం రోజులు సెలవు :కలెక్టర్

కురుపాం మండలంలో శివన్నపేటలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలకు సోమవారం నుంచి వారం రోజుల పాటు సెలవును ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ఆదివారం ప్రకటన జారీచేశారు. సీరం బైలి రుబిన్ 5 పాయింట్లకు మించి ఉంటే ముందస్తు జాగ్రత్తలు, మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అందరి వద్ద రక్త నమూనాలు తీసుకున్నామని, వాటి నివేదిక ఇంకా రాలేదని అన్నారు. నివేదిక వచ్చిన పిదప తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. అంతవరకు ప్రతి విద్యార్థిని క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది పర్యవేక్షించారన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వారం రోజుల పాటు ప్రత్యేక సెలవులు ఇచ్చినట్టు తెలిపారు.

విద్యార్థులు మరణిస్తుంటే గిరిజన మంత్రికి చలనం లేదా?

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు



ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మరణిస్తుంటే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి చలనం లేదా అని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విజయవాడ నుంచి స్థానిక విలేకరులతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల్లేక, మంచినీరు బాగో లేక 611 మంది విద్యార్థులకు జ్వరం, పచ్చ కామెర్లు వచ్చి చనిపోతున్నా మంత్రి ఇంత వరకూ పరామర్శించకపోవడం దారుణమన్నారు. 120 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవ్వడానికి కారణం మంచి నీరేనని అధికారులు ప్రకటించారన్నారు. అయితే సిపిఎం, గిరిజన సంఘం రెండేళ్ల క్రితమే గిరిజన విద్యాలయాల్లో పరిశీలన చేసి మినరల్ వాటర్ ప్లాంట్లు పాడైపోయినట్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ జిల్లాలో పాడైపోయిన మంచినీటి ప్లాంట్లను ఎక్కడా బాగుచేయలేదని విమర్శించారు. కాంట్రాక్టర్ దయాదాక్షిణ్యాలకు వదిలేశారే తప్ప ప్రభుత్వం గానీ, జిల్లా మంత్రి గాని, అధికారులు గానీ పట్టించు కోక పోవడం వల్ల ఈరోజు కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పచ్చకామెర్లు వచ్చి పిట్టల్లా రాలిపోతు న్నారని ఆందో ళన వ్యక్తం చేశారు. ఇది ఒక్క కురుపాం గురుకుల పాఠశాల కాకుండా జిల్లాలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లోనూ మౌలిక సదుపాయాలు నక్రమంగా లేవన్నారం. విద్యార్థులకు ఇస్తున్న మెనూ చాలడం లేదని, దీనివల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందక రక్తహీనతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని గిరిజన విద్యాలయాల్లో ఎఎన్‌ఎంలను నియమిస్తామని చెప్పి మంత్రి గుమ్మడి సంధ్యారాణి మొదటి సంతకం చేశారని, ఈరోజు వరకు ఇందుకు సంబంధించి ఎటువంటి పురోగతి లేదని గత వారం రోజులుగా గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సమస్య పరిష్కారానికి ప్రయత్నించకపోవడం ఆ మంత్రి పదవికే అర్థం లేదని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే గిరిజన మంత్రి రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కరించి, గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికీ ఉద్యోగంఇవ్వాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మెనూ పెంచి పౌష్టికాహారం అందించి ఎఎన్‌ఎంలను నియమించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ సమస్యలన్నింటిపై గిరిజన సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

అనారోగ్యం బారిన పడిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. సీతారాం, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి.అనిల్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్వతీపురం జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి పరామర్శించారు. వారి యోగక్షేమాలు, వారికి అందుతున్న వైద్య సేవలు గూర్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కడ వైద్య సిబ్బందితో మాట్లాడి గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోలుకోనేలా చర్యలు చేపట్టాలని కోరామన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించదల్చిన పది మెడికల్ కాలేజీల్లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో (పిపిపి విధానం) నిర్వహించడం వల్ల వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని, వైద్య విద్య అత్యంత ఖరీదుగా మారుతుందని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులు పూర్తిగా రిజర్వేషన్లు కోల్పోతారని కావున ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ వై నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.భాస్కరరావు, సిపిఐ సహాయ కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి పి.జీవ, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంఘం సిఐటియు జిల్లా కార్యదర్శి వై మన్మధరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఇప్పటికే దేశంలో పిపిపి విధానం అమలు చేసిన ఏ పథకమూ విజయవంతం కాలేదన్నారు. అలాంటి పద్ధతి వైద్య విద్యలో ప్రవేశపెట్టి ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని విమర్శించారు. సుమారు రూ.5వేల కోట్లు విలువైన భూములను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించి వారి చేతిలో ఈ మెడికల్ కాలేజీలను పెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఈ ప్రైవేట్ మెడికల్ కాలేజీల ద్వారా సుమారు రూ.20వేల కోట్లు విలువైన వ్యాపారం చేసుకునేందుకు కార్పొరేట్ అధినేతలకు అవకాశం కల్పించడమే ఈ విధానం ఉద్దేశం తప్ప ప్రజలకు ఎలాంటి మేలు జరగదని అన్నారు. కొత్తగా ప్రవేశపెట్టదల్చిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే ప్రారంభించి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిచో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజల్లో ప్రచారం నిర్వహించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, అఖిలభారత లాయర్ల అసోసియేషన్ నాయకులు ఎం వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.రామస్వామి, సిఐటియు నాయకులు డి.రమణారావు, రెడ్డి వేణు, వి.ఇందిర, ఎం.ఉమామహేశ్వరి, జ్యోతి, బి.లక్ష్మి, వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఆలోచనలు మానుకోవాలి

ప్రజాశక్తి- పాచిపెంట

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఆలోచనలను మానుకోవాలని నవయుగ కంపెనీకి ఇచ్చే అనుమతులు రద్దు చేయాలని శతాబి సర్పంచ్ శిల్పజన్ని రామయ్య ఆధ్వర్యంలో ఆదివారం సతాబి గ్రామం వద్ద కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ ఆదివాసీలను జల సమాధి చేసి హైడ్రో ప్రాజెక్టు నిర్మాణం చేయవద్దని ఇటువంటి ఆలోచనలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని హెచ్చరించారు. మోడీ కూటమి ప్రభుత్వం కలిసి నవయుగ కంపెనీకి దాసోహంతో అవుతూ అనుకూలమైన జీవో నెంబర్ 13 తీసుకు వచ్చారన్నారు. వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సభలు పెట్టకుండా ఈసా చట్టాన్ని తుంగలో తొక్కి గిరిజన హక్కులు పోరాడి సాధించుకున్న హక్కుల్ని కాలరాస్తుండడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులంతా ఐక్యంగా కలిసికట్టుగా హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8వ తేదీన గుమ్మకోట జంక్షన్ నుండి శతాబి వరకు జరగనున్న ర్యాలీలో ఆదివాసి గిరిజనులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శిల్ప జల్లి శ్రీరామ్, ఏ.గిన్నెల జానకిరామ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు అక్కాచెల్లెళ్లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హిమరక లక్షిత, సెకండ్ ఇంటర్ చదువుతున్న హిమరక సంయుక్త రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వీరిద్దరూ ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు,పాఠశాల ప్రిన్సిపాల్ అరుణజ్యోతి, సూర్యకుమారి, తండ్రి హిమరక ప్రసాదరావు అభినందించారు.



లక్షిత, సంయుక్తనుఅభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

రాష్ట్రస్థాయి హాకీకి సీతంపేట విద్యార్థులు

నియోజకవర్గ స్థాయి 69 ఎస్‌జిఎఫ్ హాకీ పోటీలకు స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లాలో జరిగిన పోటీల్లో వీరు జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి అండర్-14 హాకీకి షబీర్, జోగేంద్ర ఎంపికయ్యారు. అలాగే హాకీ అండర్-17 విభాగానికి విద్యార్థులు అగోయా, నవీన్, ప్రసన్న, త్రినాధ్, అఖిల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరి ఎంపికపట్ల ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు డిప్యూటీ వార్డెన్ గాసయ్య, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు అభినందించారు.

ఉత్సవం.. వైభవం

- ఘనంగా విజయనగరం ఉత్సవాలు ప్రారంభం
- శోభాయమానంగా శోభాయాత్ర
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు

ఉత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి అనిత



విజయనగరం ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. జానపద కళలు, కళారూపాల కనువిందు ఓవైపు.. మైమరిపింపజేసేలా శాస్త్రీయ సంగీతాలు, నృత్యరూపకాలు మరోవైపు.. ఆకట్టుకునేలా విచిత్ర వేషధారణలు, సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే నాటక ప్రదర్శనలు ఇంకో వైపు.. విజ్ఞానం పంచే వైజ్ఞానిక ప్రదర్శన, ఆద్యంతం అలరించిన కవిసమ్మేళనం.. ఇలా ఎన్నో విశేషాలు దర్శనమిచ్చాయి. విజయనగర సాంస్కృతిక వైభవానికి దర్పనం పట్టాయి. గత విజయనగర వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవ ఆరంభ వేడుక శోభాయాత్ర శోభాయమానంగా సాగింది.

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట, కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాల ప్రారంభానికి సంకేతంగా పైడితల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీ (శోభాయాత్ర)ని ప్రారంభించారు. ఈ ర్యాలీలో స్వాగత శకటం, రోలర్ స్కేటర్లు, అమ్మవారి కలశాలు, తప్పెటగుళ్లు, థింసా నృత్యం, పులి వేషాలు, కేరళ వాయిద్యాలు, కర్రసాము, కొమ్ము కోయ డాన్స్, బిందెల డాన్స్, గరగల డాన్స్, చెక్క భజన, గంగిరెద్దులు, జముకుల బృందం.. ఇలా కళారూపాలతో ర్యాలీ సాగింది. కత్తి సాము, కర్ర సాము, గురజాడ అప్పారావు వేషధారణలతో, రాజుల కాలాన్ని గుర్తుకు వచ్చేలా గుర్రపు బగ్గిలో వేషధారణలు ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మంత్రి అనిత.. పైడితల్లమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన థింసా నృత్యంలో మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి మహిళలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కోట వద్ద ప్రముఖులు ఆశీనులై కళారూపాలను తిలకించారు. ఈ సందర్భంగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకొనేందుకు ఇటువంటి పండుగలు దోహదం చేస్తాయన్నారు.

కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిసిబి చైర్మెన్ కిమిడి నాగార్జున, జెసి ఎస్.సేతు మాధవన్ పాల్గొన్నారు.



ఉత్సవ ర్యాలీలో రోటర్ స్కేటర్లు

అలరించిన జానపద కళలు

ఉత్సవాల్లో బాల భవన్ నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం కళాకారులు సంప్ర దాయ ప్రాచీన జానపద కళలను ప్రతిబింబించేలా ప్రదర్శనలిచ్చారు. అయ్యన్నపేట, ధర్మపురి మహిళా బృందాల కోలాటం, ధర్మపురి బృందం చెక్కభజన, కర్రసాము, కత్తిసాము, పులివేషాలు, థింసా నృత్యం ఆకట్టుకున్నాయి.

అబ్బురపరిచిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహారాజా సంగీత కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. వేదిక ఇన్‌ఛార్జులు కవిత, ఎస్.జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సిపల్ మండపాక నాగలక్ష్మి జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. 34 బృందాలు వారి కళలను ప్రదర్శించాయి. నాదస్వరం, గాత్రం, వీణ, ఫ్లూట్, వయోలిన్, మృదంగంతో పాటు కూచిపూడి, భారత నాట్యం ప్రదర్శనలు ఉన్నాయి. ఎస్.జానకమ్మ అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు.

ఆకట్టుకున్న సాహితీ వేదిక కార్యక్రమాలు

లేడీస్ క్లబ్ ప్రాంగణంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ జి.జనార్దననాయుడు అధ్యక్షతన నిర్వహించిన సాహితీ వేదిక కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కట్టమూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శ్రీనాథ విజయం నాటకం, చీకటి దివాకర్, సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవిసమ్మేళనం విశేషంగా ఆకట్టుకున్నాయి.



ఆకట్టుకునేలా కళాకారుల నృత్య ప్రదర్శన

పుష్ప ప్రదర్శన ప్రారంభం

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మాన్సాస్ మైదానంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శనను కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పుష్పాలను ఆసక్తిగా తిలకించారు. కూరగాయలతో ఏర్పాటు చేసిన వినాయకుని ఆకృతి వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్, ఉద్యాన శాఖ డిడి కె.చిట్టిబాబు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఎపిడి సావిత్రి పాల్గొన్నారు.

లేజర్ షో కనువిందు

స్థానిక కోట వద్ద ఏర్పాటుచేసిన లేజర్‌షో కనువిందు చేసింది. ఈ లేజర్‌షోను ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. దీనిని తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు.

☞ అయోధ్యా మైదానంలో పశు సంవర్ధక శాఖ జెడి కె.మురళీకృష్ణ పెట్‌షో ఏర్పాటుచేశారు. 35 రకాల కుక్క జాతులు , విదేశీ పక్షులు, లవ్ బర్డ్స్, కుందేళ్ళు, పుంగనూరు ఆవులను ప్రదర్శించారు.

☞ కోటలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో విజయనగరం జిల్లా మహనీయులు, వివిధ యుద్ధాల్లో అమరులైన జవాన్లకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి నివాళులర్పించారు.

నేడు తొలేళ్ల ఉత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం సోమవారం అర్ధరాత్రి జరగనుంది. ఉదయం నుంచి ప్రజలు ఘటాలతో అమ్మవారి దర్శనం కోసం భారీగా తరలిరానున్నారు. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఆలయ ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు కూడా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. తొలేళ్ల ఉత్సవం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో యాత్రికులు తరలిరానున్నారు.

నేడు ఎపి రైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పాలకొండ

ఎపి రైతు సంఘం జిల్లా మూడో మహాసభలు ఈనెల 6న (సోమవారం) జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంకు దాసు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులు తోటపల్లి నీరందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటితో మరిన్ని సమస్యలపై ఈ మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. కావున రైతులంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కండాపు ప్రసాదరావు, విజయ, ఎం.అప్పన్న, పి.జ్యోతి, దామోదర ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

అస్వస్థతకు గురైన కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ డిజి శంకరరావు ఆరాతీశారు. పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రి డిసిహెచ్ఎస్ నాగభూషణంతో పాటు కెజిహెచ్ సూపరింటెండెంట్ వాణితో చరవాణిలో మాట్లాడారు. బాలికల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కెజిహెచ్‌కు తరలించిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కురుపాం గురుకుల పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థినులు కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం చెల్లించాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కెజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో నూ ఈ విషయం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. మరణించిన ఇద్దరు బాలికలు నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, వారి కుటుంబాలకు పది లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. .సిఎం చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లందరికీ పథకం వర్తింపజేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

నిరుపేద ఆటో డ్రైవర్లకు ఆటో సేవా పథకాన్ని అందజేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి వెంకటరమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 21 తీసుకువచ్చి పెనాల్టీల పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే జిఒ 21ను రద్దు చేయాలన్నారు. 300 యూనిట్లు విద్యుత్ వాడిన వారికి పథకం వర్తింప చేయకపోవడం సరైంది కాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ఇవ్వాలని, దీన్ని రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ నిబంధనలు పెట్టి పథకాన్ని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తే భవిష్యత్తులో ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

తాగునీరు అందించండి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గుడివాడ కాలనీకి చెందిన దళిత కుటుంబాలకు తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని దళిత నాయకులు తవుడు, వెంకయ్య, అప్పయ్య, సత్యం తెలిపారు. తమ కాలనీకి సుమారు రెండు నెలల నుంచి తాగునీరు పైపులు లీకులు కారణంగా నీరు రావడం లేదన్నారు. ఈ విషయమై సర్పంచు, పంచాయితీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా మండల అధికారులు చర్యలు తీసుకుని తమకు తాగునీరందించాల్సింది కోరారు.

పొంగి ప్రవహిస్తున్న తోటపల్లి కాలువ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుడ్డిపేట -లక్ష్మీపురం మధ్యలో ఉన్న తోటపల్లి కాలువలో నీరు పొంగు ప్రవహిస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకుకాలువ నిండా నీరు ప్రవహించడంతో కాలువ పక్కనున్న పంట పొలాలు ముంపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువపై ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం ఉందని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

విద్యార్థులకు గుణాత్మక విద్య అందచేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఒ -1 ఎస్.సింహాచలం అన్నారు. మండలంలో పని చేస్తూ ఇటీవల తెలుగు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన సూరి రాము (గంగాడ), బి.లలిత (గళావిల్లి), శకుంతల (నారన్నాయుడు వలస) తదితరులు శనివారం ఎంఇఒను కలిసారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని, అందుకు తగిన విధంగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా తెలుగు భాష మీద విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా తగిన ప్రణాళికతో బోధించాలని ఉద్బోధించారు.

గురుకుల పాఠశాలలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కురుపాం

ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అనారోగ్యం బారిన పడిన నేపథ్యంలో ఆదివారం ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకులం కార్యదర్శి ఎం.గౌతమి ఆదేశాలు మేరకు పాఠశాల పరిసర ప్రాంతాల్లో మరుగు దొడ్లు, డ్రైనేజీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడిన వరకు ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమం చేపడతామని అన్నారు.

వెంకటరావును పరామర్శించిన డైరెక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరం గ్రామానికి చెందిన ఎంపిటిసి చందక వెంకట్రావు అనారోగ్యంగా ఉన్నారన్న విషయం తెలుసుకున్న రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు, పాలకొండ నియోజకవర్గం సీనియర్ నాయకులు గర్భాన సత్తిబాబు ఆదివారం తలవరం గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతుల పై ఆరా తీశారు. ఈయనతో పాటు పాలకొండ ఎఎంసి డైరెక్టర్ వండన సాయికుమార్, జనసేన నాయకులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఎన్‌టిఆర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడం, అందులోనూ దసరా సెలవులు ముగింపు కావడంతో పర్యాటకులు తరలి వచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద్ విహార వద్ద డ్యాన్సులు వేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. ఆల్ ట్రైన్ వెహికలతో చుట్టుముట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

ప్రజాశకి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మ లక్ష్మీపురం, ఎల్విన్ పేట గ్రామాల్లో కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు వేశారు. కుక్క కరిచిన ఏడాది పాటు ఏమీ కాకుండా ఉండేందుకు ఈ వ్యాక్సిన్లు ఎంతగానో ఉపయోగపడతాయని పశు వైద్యాధికారి లక్ష్మణరావు తెలిపారు. పై రెండు గ్రామాల్లో సుమారు 100 వరకు వీధి కుక్కలను ఏరివేసి వేరే చోటుకు తరలించినట్టు తెలిపారు.

గురుకులంలో సమస్యల తిష్ట

- తరగతి గదుల్లోనే పడక
- అరకొరగా మరుగుదొడ్లు
- మూలకు చేరిన ఆర్ఒ ప్లాంట్
- జనరేటర్ లేక అంధకారం

గురుకుల పాఠశాల, కళాశాల సమస్యలు తిష్టవేశాయి. చాలా ఏళ్ల క్రితమే ఈ కళాశాల స్థాపించినప్పటికీ స్థల గుర్తింపు. భవన నిర్మాణాల్లో జాప్యం వల్ల 2018లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో భవనాలు నిర్మించారు. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇక్కడ విద్యార్థులు ఉంటారు. ఏటా సుమారు 600మంది వరకు విద్యార్థుల సంఖ్య ఉంటోంది. ఈ ఏడాది 611 మంది ఉన్నారు. ఉన్నంతలో విద్యాబోధన బాగానే ఉంటోంది. టెన్త్, ఇంటర్లో మార్కుల శాతం కూడా మెరుగ్గానే ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఇటువంటి సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు తగిన సాకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడి మృతి చెందుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - కురుపాం

పదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పాఠశాల సముదాయం అపరిశుభ్రతకు నిలయంగా ఉంది. పాఠశాల ప్రాంగణంలో లైట్లు గానీ, విద్యుత్ లేని సమయంలో జనరేటర్ కూడా లేకపోవడంతో రాత్రి పూట విష సర్పాలు కనిపిస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైదానమంతా ఎత్తుపల్లాలతో నిండివుండడంతో పాటు డ్రైనేజ్ సక్రమంగా లేకపోవడంతో వర్షంనీరు చేరుతోంది. రోజుల తరబడి నీరు నిల్వవుండిపోవడంతో వర్షాకాలంలో ఆయా గుమ్ముల్లో దోమలకు వృద్ధికేంద్రాలుగా మారాయి. దీంతో ఇక్కడి విద్యార్థులు తరచూ రోగాల బారినపడుతున్నారు. వీటికోసం ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. దీంతో అప్పుడప్పుడూ విద్యార్థుల తల్లిదండ్రులే శ్రమదానం చేస్తూ పరిసరాలను కొంత వరకు చక్కదిద్దుతున్నారు. విస్తీర్ణం ఎక్కువ ఉండడంతో శ్రమదానం కూడా సరిపోని పరిస్థితి.

వసతి లేమి

వసతి లేమితో ఒకే గదిలో ఐదు గ్రూపులకు చెందిన లేబొరేటరీలు నడుస్తున్నాయి. వాస్తవంగా ఇక్కడ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీతో పాటు స్కూల్ లేబొరేటరీలు విడివిడిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ గదులు పరిమితంగా ఉండడం వల్ల వీటన్నింటినీ ఒకే గదిలో పెట్టారు. దీంతో ప్రయోగాత్మక తరగతులు సకాలంలో నిర్వహించలేని పరిస్థితి. ప్రయోగశాలగా ఉపయోగించే గది కూడా సంబంధిత పరికరాలతోనే నిండివుండడంతో విద్యార్థులు ఇబ్బందిగా కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. సుమారు 611 మంది విద్యార్థులు గల ఈ వసతి గృహంలో డైనింగ్ హాల్ వందమందికి కూడా సరిపోని పరిస్థితి. దీంతో, ఎండైనా, వానైనా విద్యార్థులు చెట్ల కింద లేక ఆరుబయట భోజనాలు చేయాల్సిన దుస్థితి. పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం నిధులు మంజూరైనా పనులు ఫిల్లర్లకే పరిమితమయ్యాయి. అరకొర నిధులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో పనులు నిలిచిపోయాయి.



చెత్తాచెదారం, మురుగునీరు నిల్వ ఉన్న పాఠశాల ఆవరణ

అరకొరగా మరుగుదొడ్లు

వందలాది మంది విద్యార్థులు ఉంటున్న ఈ వసతిగృహంలో సరిపడా మరుగుదొడ్లు లేవంటే అతిశయోక్తి కాదు. మరుగుదొడ్లకు గానీ డ్రైనేజ్ సిస్టమ్, ఇంటర్నల్ రోడ్లు లేవు. దీంతో వాడుక నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోంది. వ్యాధులు ప్రబలడానికి ఇది కూడా ఒక కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని వైద్యపరీక్షలు

ప్రతి ఆరు మాసాలకోసారి వసతి గృహంలో వైద్యపరీక్షలు నిర్వహించాల్సి ఉండగా సక్రమంగా నిర్వహించకపోవడం వసతి గృహంలో కనీసం జనరేటర్ సదుపాయం కూడా లేదు. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడితే పదెకరాల్లో విస్తరించివున్న ఈ భవన సముదాయమంతా అంధకారమే. ఆ సమయంలో పురుగుబుట్రా వంటి విషసర్పాలు కానరాని పరిస్థితి చాలా మంది విద్యార్థులు భయపడుతున్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

విద్యార్థులను పరామర్శించిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినులను ఆదివారం అరకు ఎంపి డాక్టర్ తనూజ రాణి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్ప శ్రీవాణి పరామర్శించారు. ఆసుపత్రిలో విద్యార్థులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ వైఫల్యం వల్లే కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థుల మరణాలు సంభవించాయని చెప్పారు. గడచిన ఏడాదిన్నరలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఒక్కసారి కూడా సంబంధిత శాఖ అధికారులు, ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించలేదన్నారు. గురుకుల పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని విమర్శించారు.

ప్రభుత్వ వైద్యుల సమ్మెతో నిలిచిన సేవలు

ప్రజాశక్తి - సీతానగరం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యుల సమ్మెతో గ్రామీణ వైద్య సేవలు నిలిచిపోయాయి. తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ పిహెచ్‌సి వైద్యాధికారులు గత వారం రోజులుగా సమ్మెలోకి వెళ్లారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు అందించే సేవలు నిలిచిపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో గల సీతానగరం, పెద అంకలం పిహెచ్‌సి వైద్యులు సమ్మెతో విధులకు హాజరు కావడంలేదు. దీంతో ఈ కేంద్రాల ద్వారా ఒక్కొక్క వైద్యులకు 17 పంచాయతీల్లో 104 వాహనాలతో వైద్యం అందించా వారు. సమ్మెకు ముందు ప్రతి గ్రామానికి 104 ద్వారా వైద్యమందించి దీర్ఘకాలిక రోగులకు బిపి, షుగరు, సాధారణ రోగులకు పరీక్షలు నిర్వహించి అక్కడే మందులు ఉచితంగా పంపిణీ చేసేవారు. దీంతో రోగులకు కొంతమేరకు ఉపశమనం ఉండేది. ఇప్పుడు 104 వాహనం గ్రామాలకు వెళ్లకపోవడంతో ఆయా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నప్పటికీ ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్యుల సమ్మెను విరమింప చేసే దిశగా ప్రయత్నించి ప్రజలకు వైద్యమందించాలని ప్రజలు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థినులు మృతి చెందడం బాధాకరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం గిరిజన ఆశ్రమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు అయిదు రోజుల వ్యవధిలో పువ్వల అంజలి, తోయక కల్పన అనారోగ్యంతో మృతి చెందడం బాధకరమని వైసిపి జిల్లా విద్యార్థి అనుబంధ అధ్యక్షులు, గుమ్మలక్ష్మీపురం మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని ఎప్పటి నుండో కోరుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కారణం చేతనే విద్యార్థులకు మెరుగైన వైద్యం అందక మరణించారని అన్నారు. కురుపాం పాఠశాలతో పాటుగా జిల్లాలో అన్ని పాఠశాలలో కూడా మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెజిహెచ్, పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న మిగిలిన విద్యార్థినిలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

'అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థినుల మరణాలు'

ప్రజాశకి - గుమ్మలక్ష్మీపురం

జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం వల్లే గిరిజన విద్యార్థినుల మరణాలకు శాపంగా మారిందని జిల్లా ఎస్టి మోర్చా నిమ్మక సింహాచలం అన్నారు. కురుపాం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మరణాలకు గల కారణాలపై విచారం వ్యక్తం చేశారు. పాఠశాలలో సరైన వసతి, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఎక్కువ మంది పచ్చకామెర్లకు గురయ్యారని అన్నారు. పౌష్టిక, నాణ్యత గల ఆహారం అందించకపోవడం, కలుషితమైన నీటిని వినియోగించడం కూడా కారణమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు పౌష్టికాహారం అందజేసి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

గాంధీ విగ్రహ ధ్వంసం కేసులో 8 మంది అరెస్ట్

సాలూరు : గాంధీ జయంతి రోజున మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో గల గాంధీ విగ్రహానికి తల తొలగించిన ఘటనలో అదే గ్రామానికి చెందిన ఆరుగురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు రూరల్ ఎస్ఐ నరసింహామూర్తి తెలిపారు. మిగతా ఇద్దరి మీదా కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల ప్రాణాలకు విలువనివ్వండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు పాలకులు, అధికారులు విలువివ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కమిటీ నాయకులు కోలక మల్లేష్‌తో కలిసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను ఆయా గ్రామాలు కంబ గూడ, దండు సూర గ్రామాలకు వెళ్లి మాట్లాడారు. మృతి కి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తోయక కల్పన తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల నుంచి విశాఖ కెజిహెచ్‌లో వైద్యం కోసం వెళ్లే వరకు నిర్లక్ష్యం, కాలయాపన చేయడం వల్లే తన బిడ్డ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారని రంజిత్ కుమార్ తెలిపారు. విజయనగరం ఆసుపత్రిలో నాలుగు రోజులు, పార్వతీపురంలో రెండు రోజలు, రిపోర్ట్, అంబులెన్స్ ఏర్పాటు లో ఆలస్యం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో కూడా అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. చేతికి అంది వచ్చిన బిడ్డను కోల్పోయామని రోధించారు. అలాగే అంజలి తల్లిదండ్రులు మాట్లాడుతూ తన బిడ్డ ఎందుకు చనిపోయిందో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు నష్ట పరిహారం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంజలి తల్లి కి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రోజుకీ బాధిత తల్లిదండ్రులను స్థానిక ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పరామర్శ చేయలేదని, ఇదేం పద్ధతి అని రంజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో వైద్యం కోసం చేరిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సురక్షితమైన తాగునీరు లేక, పౌష్టికాహారం, పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక, నీరు కలుషితం అవ్వడం మూలంగానే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని అన్నారు.



అంటివలసలో నేలకొరిగి మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

తుపాను నేపథ్యంలో నష్టపోయిన అన్ని పంటలకూ పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి గిరిజన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మైదాన ప్రాంతాలతో పాటు అంటివలస కొండపై ఉన్న నష్టపోయిన జీడి, ఇతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు రోజుల క్రితం భారీ వర్షాలకు పలు గిరిజన గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో పంట కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. వీటి పైన వెంటనే రెవెన్యూ శాఖ అధికారులు అప్రతమై నష్టపరహాన్ని గుర్తించాలని కోరారు. గిరిజన గ్రామాలతో పాటు మైదాన ప్రాంతంలో. ప్రజలకు తాగునీరు, శానిటెషన్, గ్రామాల్లో వైద్యం పూర్తిస్థాయిలో అందించే విధంగా అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ బోడియ, హుయిక రామారావు, వెంకటేష్, సుజాత రాజు, పద్మ, కాంతమ్మ, సంతోష్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఎక్కడా?

- రైతుల నుంచి రూ.2400కు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- దళారుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - సాలూరు

అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏ ప్రభుత్వాలు వచ్చినా తమ బతుకులు మారవా అని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎన్నికల ముందు ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నారని, ఆ తర్వాత తమకు మొండిచేయి చూపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో రైతులు పూర్తిగా అప్పుల్లో కూరుకుపోతున్నారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పండించిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అమలు కాకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ఈ ఏడాదే అదే పరిస్థితి

మన్యం జిల్లాలో అత్యధికంగా సాలూరు నియోజకవర్గంలో మొక్కజొన్న ఎక్కువగా సాగవుతుంది. ఈ పంటకు ఎకరాకు రూ.40 వేలు వరకు ఖర్చవుతుంది. ఎకరాకు 25 నుండి 30 బస్తాల వరకు దిగుబడి రావటం విశేషం. దిగుబడి ఆశాజనకంగా వచ్చినప్పటికీ మొక్కజొన్న పండించిన రైతుల ముఖాల్లో ఆనందం లేకపోవడం విశేషం. ఎందుకంటే మద్దతు లేకపోవడమే. ఇప్పటికే కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పంటను అత్యంత తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పండించిన పంటను అప్పనంగా రైతుల నుంచి దోచుకోవడానికి దళారులు ప్రయత్నిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?

జిల్లాలో లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతుంది. పంట కోతలు కూడా ప్రారంభమయ్యాయి. అయితే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాలకు రూ.2400 ఇవ్వాల్సి ఉండగా, జిల్లాలో ఏ ఒక్కచోటైనా కొనుగోలు కేంద్రాలు పెట్టలేదు. దీంతో దళారీలు కేవలం క్వింటాలకు రూ.1800 నుంచి రూ.2050కు కొనుగోలు చేస్తూ రైతుల్ని మోసగిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మద్దతు ధరల చట్టం అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, మార్క్ ఫెడ్ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని జిల్లా లోని, మండల కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఆలస్యం చేస్తే పంట కోత విస్తీర్ణం పెరిగే కొద్దీ దళారులు మరింత సిండికేట్ గా మారి మొక్కజొన్న ధరను మరింత తగ్గించే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుమీద ఆరబెట్టిన మొక్కజొన్న

పంట బాగాపండిందని ఆనందపడాలో... గిట్టుబాటు ధర లేదని బాధపడాలో

నేను సుమారు పది ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పండించాను. ఈ పంట బాగా దిగుబడి అయితే వచ్చింది. అయితే అమ్మకానికి పెట్టగా కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ విషయమై స్థానిక వ్యవసాయ అధికారులను కలవగా, ఇదిగో వస్తాం, అదిగో వస్తామని చెప్పడమే కానీ ఇప్పటివరకు వచ్చి ఈ పంట ఎలా ఉంది? ఇది ఎంతవరకు రంగు మారింది, దీన్ని ఎవరు కొనుగోలు చేస్తారన్నది పట్టించుకోలేదు. దీంతో పంట బాగా పండిందని ఆనందపడాలో... గిట్టుబాటు ధర లేదని బాధపడాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నాను.

ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల గురించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్దనున్న మొక్కజొన్నను కొనుగోలు చేస్తాం.

నీలిమ,
మార్క్ ఫెడ్, డిఎం.

నీట మునిగిన ఇరిడి పాఠశాల తాత్కాలిక షెడ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తుపాను ప్రభావంతో భారీగా కురిసిన వర్షాలకు మండలంలోని ఇరిడిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తాత్కాలిక షెడ్ నీట మునిగింది. పాఠశాల పక్కా భవనం శిథిలావస్థకు చేరడంతో సర్వశిక్ష అభియాన్ నిధులతో ఏడాది కిందట నూతన భవన నిర్మాణానికి పనులు ప్రారంభించారు. పునాదులు, పిల్లర్లు స్థాయిలో పనులు నిలిచిపోయాయి. విద్యార్థులు చదువుకు ఆటంకం లేకుండా తాత్కాలికంగా రేకుల షెడ్ ఏర్పాటు చేసి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. ఇక్కడ 56మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు విద్యాబోధన ఎక్కడ చేపట్టాలి, విద్యార్థుల కష్టాలు ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి త్వరితగతిన పాఠశాల శాశ్వత భవనం నిర్మించాలని కోరుతున్నారు.